## ఎపిఒను సరెండర్ చేస్తూ తీర్మానం

**సాలూరురూరల్:** ఎపిఒ కె.రామకృష్ణను సరెండర్ చేయాలని కోరుతూ మండల పరిషత్ ఎంపిటిసి సభ్యులు మంగళవారం ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి జి.రాములమ్మ అధ్యక్షతన మండల పరిషత్ ఎంపిటిసిలు సమావేశమయ్యారు. ఎపిఒ మండలంలోని సర్పంచ్, ఎంపిటిసిల అనుమతి లేకుండా ఉపాధి పనులు చేయించాలని చూస్తున్నారని, గతంలో నిర్వహించిన గ్రామసభల ఆమోదం లేకుండా కొన్ని పనులను పాత తీర్మానాల్లో చేర్పించాలని పంచాయతీ కార్యదర్శులపై ఒత్తిడి చేశారని పేర్కొన్నారు. పల్లె పండుగ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాలను సర్పంచులు లేకుండా చేపట్టారని ఆరోపిస్తున్నారు. దీంతో ఎపిఒను సరెండర్ చేయాలని కోరుతూ చేసిన తీర్మానాలను జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, డుమా పిడి రామచంద్రరావు లకు పంపించారు.

# ప్రభుత్వంతో కలిసి కార్పొరేట్ మైండ్‌గేమ్

- మొన్న మైనింగ్ అధికారి గందరగోళ ప్రకటన
- నిన్న కిరాయి వ్యక్తులతో కలెక్టరేట్ వద్ద అనుకూల ధర్నా
- గ్రానైట్ తవ్వకాలతో ఉపాధి లభిస్తుందని విష ప్రచారం
- జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం

**ప్రజాశక్తి - పార్వతీపురం**

మండలంలో అత్యంత వివాదాస్పదమైన బడిదేవరకొండ గ్రానైట్ తవ్వకాల విషయంలో లైసెన్స్ పొందిన ఎంఎస్‌పి కంపెనీ ప్రభుత్వం అండదండలతో మైండ్ గేమ్ మొదలు పెట్టింది. ఒకవైపు బండి దేవరకొండపై గ్రానైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా సమీపంలో ఉన్న పది గ్రామాల ప్రజలు, గిరిజనులు పోరాడుతున్నారు. గత కొన్నేళ్లుగా బడిదేవరకొండ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యాన దశలవారీ ఉద్యమాన్ని ఉధృతం చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. ఇది గమనించిన గ్రానైట్ కంపెనీ యజమాని తన కార్పొరేట్ మాయాజాలంతో ఉద్యమాన్ని నిర్వీర్యం చేసేందుకు రకరకాల కుయుక్తులు పన్నుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిలో భాగంగానే కొద్ది రోజుల క్రితం జిల్లా మైనింగ్ అధికారి జయప్రసాద్ ఒక గందరగోళ ప్రకటన విడుదల చేశారు. గ్రానైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రభావిత గ్రామాల ప్రజలను మభ్యపెట్టేలా, గందరగోళానికి గురి చేసేలా ఆ అధికారి ప్రకటన కనిపించింది. గ్రానైట్ తవ్వకాలకు లైసెన్స్ పొందిన ఎంఎస్‌పి కంపెనీకి లీజుకు ఇచ్చిన భూమి బడిదేవర కొండపై లేదని, ఆ కొండపై గ్రానైట్ తవ్వకాలకు అనుమతి ఇవ్వలేదని ప్రకటించారు. అయితే రిజర్వ్ ఫారెస్ట్ భూమికి, రెవెన్యూ భూమి కి మధ్య ఉన్న గయాలు భూమి లో గ్రానైట్ తవ్వకాలకు అనుమతి ఇచ్చినట్లు మరోవైపు అదే ప్రకటనలో పేర్కొనడం విడ్డూరంగా ఉంది. మైనింగ్ అధికారి ప్రకటనను ఖండిస్తూ బడిదేవరకొండ పరిరక్షణ కమిటీ సభ్యులు సోమవారం విలేకరుల సమావేశంలో నిర్వహించారు. పర్యావరణహితంగా ఉన్న బండి దేవరకొండను కాపాడుకునేందుకు పోరాడుతున్న ప్రజల్ని గందరగోళంలోకి నెట్టేందుకే ప్రభుత్వం ఈ ప్రకటన చేయించిందని పరిరక్షణ కమిటి సభ్యులు నిర్ధారించారు. గ్రానైట్ తవ్వకాలకు లైసెన్స్ రద్దు చేయాలని, లేకపోతే ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి, సిపిఐ జిల్లా కార్యదర్శి మన్మధరావు, చెరువుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు వి.దాలినాయుడు, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర జిల్లాల ప్రధాన కార్యదర్శి పి.రంజిత్ కుమార్‌తో పాటు ఇతర సంఘాల నాయకులు పరిరక్షణ కమిటీ సభ్యులుగా వుండి పోరాట కార్యాచరణ కోసం వ్యూహరచన లో వున్నారు.

ఇప్పటికే బడిదేవరకొండపై గ్రానైట్ తవ్వకాలకు పనులు ప్రారంభించిన ఎంఎస్‌పి కంపెనీ యాజమాన్యం ప్రభుత్వం అండతో తవ్వకాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజల్ని విభజించి పాలించు అన్న చందంగా ఉద్యమాన్ని నిర్వీర్యం చేసేందుకు రకరకాల కుయుక్తులకు శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. దీనిలో భాగంగా మొదటి విడత కింద ప్రభుత్వ అధికారితో గందరగోళ ప్రకటన విడుదల చేయించడం, రెండో విడత కిరాయి వ్యక్తులతో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయించడం వంటి కపటనాటకాలకు తెరలేపారు. మున్ముందు ప్రభుత్వంతో కలిసి ఇంకెన్ని విషప్రచారాలతో ప్రజల పోరాటానికి అడ్డంకులు సృష్టిస్తారో వేచి చూడాల్సిందే.

### కిరాయి మనుషులతో కలెక్టరేట్ వద్ద ధర్నా

బడిదేవర కొండపై గ్రానైట్ తవ్వకాలకు లైసెన్స్ పొందిన ఎంఎస్‌పి కంపెనీ యజమాని మంగళవారం మరో నాటకానికి తెర లేపారు. గ్రానైట్ తవ్వకాలకు అనుకూలంగా సమీప గ్రామాల ప్రజలు ఆందోళన చేస్తున్నారనే భ్రమ కల్పించేందుకు వ్యూహరచన చేశారు. గ్రానైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రభావిత గ్రామాల ప్రజలను కాకుండా సంబంధం లేని కొంతమంది కిరాయి వ్యక్తులతో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయించారు. శివిని, కొంకరాడ, జగన్నాధపురం గ్రామాలకు చెందిన కొంతమంది మహిళలు, వ్యవసాయ కూలీలకు డబ్బులు ఇచ్చి కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేయించారు. ఒక్కో వ్యక్తికి రూ.400చొప్పున చెల్లించి సుమారు 50మంది కిరాయి మనుషులతో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నా అనంతరం కలెక్టరేట్ ఆవరణలో ఉన్న కిరాయి వ్యక్తులను విలేకరులు ప్రశ్నించగా తామంతా శివిని, జగన్నాధపురం, కొంకరాడ గ్రామాలకు చెందినవారమని చెప్పారు. గ్రానైట్ తవ్వకాలకు అనుకూలంగా మాట్లాడితే తమకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారని మహిళలు తెలిపారు.

కలెక్టరేట్ వద్ద ధర్నాచేస్తున్న వ్యక్తులు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

## సరికొత్త ఆలోచనలతో ముందుకు రండి

### స్వచ్ఛ సుందర పార్వతీపురం సమావేశంలో కలెక్టర్

**ప్రజాశక్తి -పార్వతీపురం**

పార్వతీపురం పట్టణాన్ని స్వచ్ఛ సుందర పార్వతీపురంగా తీర్చిదిద్దడంలో సరికొత్త ఆలోచనలతో ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ప్రభుత్వ పాఠశాలల ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. స్వచ్ఛ సుందర పార్వతీపురంలో అందర్నీ భాగస్వాములను చేసేందుకు ప్రణాళికను సిద్ధం చేస్తున్నామన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో స్వచ్ఛ సుందర పార్వతీపురం, అంగన్వాడీల సుందరీకరణపై ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛ సుందర పార్వతీపురంలో భాగంగా ప్లాస్టిక్ నిషేధం, చెత్త సేకరణ చేసి ఎక్కడికక్కడ శుభ్రపరచడం ద్వారా స్వచ్ఛ పార్వతీపురంగా రూపుదిద్దుకోగలదని అభిప్రాయపడ్డారు. తడి, పొడి చెత్తలను వేరుచేసి చెత్త నుండి సంపదను సృష్టించడం, పిల్లల కొరకు సుందరమైన పార్కులు, ముఖ్యకూడళ్లలో స్క్రాప్ ఆర్ట్స్, బర్రెల గ్రౌండ్ వంటివి ఏర్పాటు చేసేందుకు సంకల్పించినట్లు చెప్పారు. ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఆర్‌టిసి కాంప్లెక్స్, బస్టాండ్, రైల్వే స్టేషన్, జన సంచారం ఉన్న ప్రదేశాలను గుర్తించి స్వచ్ఛ సుందర పార్వతీపురం లోగోలను, సెల్ఫీ పాయింట్లను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ప్రతి చోటా స్వచ్ఛ సుందర పార్వతీపురం పేరిట డిజిటల్ బోర్డులు ఉంచాలని, ప్రభుత్వ స్థలాలు, బహిరంగ గోడలపై గిరిజన సంస్కృతిని ప్రతిబింబించేలా సవర ఆర్ట్స్‌తో కూడిన చిత్రాలను, ప్రజలను చైతన్యపరిచే చిత్రాలను వేయించాలని తెలిపారు. ఖాళీ ప్రదేశాలను గుర్తించి బ్యూటిఫికేషన్ చేయించాలని అన్నారు. స్వచ్ఛ సుందరీకరణలో అంతకుముందు, సుందరీకరణ తదుపరి ప్రతిబింబించే చిత్రాలు ప్రజలకు అర్థమయ్యేలా ఏర్పాటు చేయాలని చెప్పారు. అనుమతితో మాత్రమే ఫ్లెక్సీ బోర్డులు ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకోవాలని పురపాలక సంఘ టౌన్ ప్లానింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఇంకా మరింత సుందరంగా పార్వతీపురాని తీర్చిదిద్దేందుకు సరికొత్త ఆలోచనలతో ముందుకురావాలని ఉపాధ్యాయులను కలెక్టర్ కోరారు.

**అంగన్వాడీ కేంద్రాలను అందంగా తీర్చిదిద్దాలి**

జిల్లాలో 516 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయని, వాటికి మంచి రంగులు వేసి అందంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఇప్పటికే పెయింటింగ్స్ వేయించి ఉన్నవాటిని మినహాయించి, మిగిలిన కేంద్రాలకు లోపల, వెలుపల నిర్దేశించిన రంగులను వేయాలని పేర్కొన్నారు. గోడలపై బొమ్మలను వేయించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని చెప్పారు. ప్రతి అంగన్వాడీ కేంద్రానికి వెలుపల అందరికీ కనిపించేలా నేమ్ బోర్డ్ ఏర్పాటు చేయాలని, కేంద్రానికి అవసరమైన ఫర్నీచర్, బోర్డులు ఇతరత్రా సామాగ్రిని పంపిణీ చేస్తామని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో ఐసిడిఎస్ పీడీ ఎంఎన్ రాణి, డిఇఒ జి.పగడాలమ్మ, ఇతర జిల్లా అధికారులు, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ ఉపాధ్యాయులు, సిడిపిఓలు తదితరులు పాల్గొన్నారు.

## డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్

**ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్**

డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు చైర్మన్, రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున కాక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని అన్ని రకాలైన సివిల్, క్రిమినల్, ఇతర కేసులు పరిష్కారం చేసుకోగలరని ప్రకటనలో కోరారు.

## ఐటిఐలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరణ

**ప్రజాశక్తి - సీతంపేట**

స్థానిక ఐటిఐలో ప్రవేశాలకు ఐదో విడత దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎం.గోపాలకృష్ణ తెలిపారు. ఆన్ లైన్‌లో iti.ap.gov.in వెబ్ సైట్ ద్వారా ఈనెల 26 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులంతా ఈనెల 27లోగా ఏదైనా ప్రభుత్వ ఐటిఐలో ఒరిజినల్ సర్టిఫికెట్స్ ను వెరిఫికేషన్ చేయించు కోవాలన్నారు. సదరు వెరిఫికేషన్ చేయించుకున్న అభ్యర్థులు మాత్రమే ప్రవేశానికి అర్హులన్నారు. సర్టిఫికేట్ వెరిఫికేషన్ చేసుకున్న అభ్యర్థులు మాత్రమే అడ్మిషన్ల కౌన్సిలింగ్‌కు ఈనెల 28న తమ అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని సూచించారు.

రికార్డులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ

## సచివాలయాల ఆకస్మిక తనిఖీ

### గైర్హాజరైన ప్లానింగ్ సెక్రటరీకి మెమో

**ప్రజాశక్తి - సాలూరు**

మున్సిపాలిటీ పరిధిలో గల 2,3 వార్డుల సచివాలయాన్ని మంగళవారం మున్సిపల్ కమిషనర్ విహెచ్.సత్యనారాయణ అకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా రెండో వార్డు సచివాలయం ప్లానింగ్ సెక్రటరీ రెడ్డి మహేష్ విధులకు హాజరు కాలేదని గుర్తించారు. వెంటనే గైర్హాజరైన ప్లానింగ్ సెక్రటరీ మహేష్‌కు కమిషనర్ మెమో జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధులకు హాజరు కాకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## విద్యార్థుల్లో రక్తహీనత నివారణకు కృషి

**ప్రజాశక్తి - పార్వతీపురం**

విద్యార్థుల్లో రక్తహీనత నివారణకు కృషి చేయాలని వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. ఈ మేరకు కొత్తవలస కెపిఎం ఉన్నత పాఠశాలను మంగళవారం సందర్శించారు. ఉపాధ్యాయ, వైద్య సిబ్బందితో సమీక్ష చేసి విద్యార్థుల ఆరోగ్యం, హీమోగ్లోబిన్ రక్త పరీక్షల వివరాలపై చర్చించారు. ఎంత మంది విద్యార్థులకు హీమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు, అందులో స్వల్ప, మాధ్యమిక, తీవ్ర రక్త హీనతగా గుర్తించిన వారికి రక్త శాతం వద్ధి చెందేందుకు ఏ విధమైన చర్యలు చేపడుతున్నారని అడిగారు. సికిల్ సెల్ ఎనీమియాతో ఎవరినైనా గుర్తించడం జరిగిందా, నిర్ధారణ పరీక్షల వివరాలపై అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో అందజేస్తున్న ఆహారం విద్యార్థులు సక్రమంగా తీసుకుంటున్నారా అని పాఠశాల సిబ్బంది గమనించాలన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి ఆరోగ్య సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వై. అప్పలనాయుడు, సుపర్వైజర్స్ ఇందిర, జయగౌడ్, వైద్య సిబ్బంది కిరణ్ కుమారి, ఉపాధ్యాయులు ఎల్. సత్యనారాయణ, ఆశా కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## వృద్ధులను ఇబ్బందులు పెడితే శిక్షార్హులు

**ప్రజాశక్తి - పార్వతీపురం**

వయోవృద్ధులను, తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసి, నిరాదరణకు గురిచేస్తే శిక్షార్హులని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు సంక్షేమ శాఖ రూపొందించిన అవగాహన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం జిల్లా కలెక్టర్ విడుదల చేశారు. 60ఏళ్లు దాటిన తల్లిదండ్రులు, వయోవృద్ధుల సంరక్షణ, భద్రత కల్పించాల్సిన బాధ్యత వారి కుమారుడు, కుమార్తెలదేనన్నారు. తల్లిదండ్రులను పట్టించుకోని పిల్లల నుంచి పోషణ ఖర్చులు కోరే హక్కు తల్లిదండ్రులకు ఉంటుందన్నారు. తల్లిదండ్రులు, వయోవృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం సంరక్షణ చట్టం చేసిందని, చట్టం అమలులో భాగంగా వృద్ధుల సమస్యలకు సంబంధించిన కేసుల పరిష్కారానికి జిల్లా స్థాయిలో కలెక్టర్, ఆర్‌డిఒ ఆధ్వర్యంలో ట్రిబ్యునల్‌ను ప్రభుత్వం నియమించిందన్నారు. జిల్లాలో ఎక్కడైనా తల్లిదండ్రులు, వయో వద్దులు వారి పిల్లలు, బంధువుల వల్ల ఇబ్బందులు పడుతున్న వారు ఆర్‌డిఒకు రాత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ జి.కేశవ నాయుడు, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఎడి కె.కవిత, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, డిఇఒ జి.పగడాలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## తుపాను పట్ల అప్రమత్తం : కలెక్టర్

**ప్రజాశక్తి - పార్వతీపురం**

తుఫాను కారణంగా ఈనెల 23 నుంచి 25 వరకు జిల్లాలో ఈదురుగాలులు, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ జిల్లా, మండల అధికారులను ఆదేశించారు. అధికారులంతా సమన్వయంతో పని చేసి ఎక్కడా ఎటువంటి ప్రాణ,ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అన్నారు. వర్షాప్రభావాన్ని బట్టి పాఠశాలలకు సెలవులను ప్రకటించాలన్నారు. శిథిలావస్థలోని గృహాల్లో నివసించే వారిని, గర్భిణులు, వృద్ధులను వసతి గృహాలకు తరలించాలని సూచించారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా చూడాలని, పిడుగులు పడే అవకాశం ఉండే ప్రాంతాల గురించి ప్రజలకు అవగాహనా కల్పించి, సురక్షిత ప్రాంతాల్లో ఉండేలా చర్యలు చేపట్టాలని అన్నారు. సచివాలయ సిబ్బంది, రెవిన్యూ, పోలీసులు ప్రజలు ఆరుబయట తిరగరాదని తెలిపారు. క్షేత్ర స్థాయిలో జరిగే నష్టాలను పరిశీలించేందుకు ప్రతి మండలంలో చిన్న డ్రోన్లను సిద్ధం చేసుకోవాలని సూచించారు. రైతులకు పంటల పట్ల తగు సూచనలు సలహాలు ఇవ్వాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. జల వనరుల శాఖ వివిధ రిజర్వాయర్లలో నీటి ప్రవాహ పరిస్థితి ఎప్పటికప్పుడు గమనించాలని ఆయన ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకుండా ఎటువంటి నిర్ణయం తీసుకోరాదని హెచ్చరించారు.

**నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు సజావుగా నిర్వహించాలి**

జిల్లాలో నవంబర్ 23న నీటి వినియోగదారుల సంఘాలు, 26న డిస్ట్రిబ్యూటరీ, 28న ప్రాజెక్ట్ కమిటీల ఎన్నికలు జరుగుతాయని, ఇందుకు సంబంధించిన ప్రక్రియను జాగ్రత్తగా నిర్వహించి జిల్లాలో సజావుగా ఎన్నికలు జరిపించాలని మండల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికలకు సంబంధించి శిక్షణ కార్యక్రమం ఉంటుందని అన్నారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ కార్యాలయ వీడియో సమావేశ మందిరంలో జిల్లా, మండల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రెవెన్యూ శాఖకు చెందిన అర్జీలు ఎక్కువ పెండింగ్ ఉంటున్నాయని, వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి 24 గంటల్లోగా పరిష్కరించాలని అన్నారు. గ్రామాల్లోని సమస్యలు ఆ గ్రామ సచివాలయం ద్వారానే పరిష్కరించవచ్చుని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గృహ నిర్మాణాల గురించి సమీక్షిస్తూ ఇచ్చిన లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలని అన్నారు. లక్ష్యాల సాధనలో నిర్లక్ష్యం వహించి, వెనుకంజలో ఉన్న సాలూరు, పాలకొండ అర్బన్ ఎఇలపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అంగన్వాడీలపై సమీక్షించిన ఆయన పోషణ్ వాటిక కింద ఆకుకూరలను పండించి, వాటిని పిల్లలు తీసుకొనే ఆహారంలో వినియోగించాలన్నారు. ప్రతి కేంద్రానికి రంగులు, మరుగుదొడ్లు, వాష్ బేసిన్, తాగునీరు వంటి మౌలిక వసతులు, ఇంకుడుగుంతను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. వీటికయ్యే నిధులను మంజూరు చేస్తామన్నారు. న్యూట్రీ గార్డెన్స్ పై విద్యార్థులకు అవగాహన కల్పించాలని, మై స్కూల్ - మై ప్రైడ్ కింద ప్రతి మాసం రెండు, నాల్గవ మంగళవారాల్లో పాఠశాలలను సందర్శించి, 10వ తరగతి విద్యార్థులతో ముచ్చటించి అవగాహన కల్పించాలని తెలిపారు. స్వర్ణాంధ్ర బుక్ లెట్ ప్రతి ఒక్కరి వద్ద ఉండాలని, లక్ష్యాలను ప్రతి 15 రోజులకు ఒకసారి ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని అన్నారు. ఉపాధి హామీలో 549 పనులను రూ.349 కోట్లతో చేపట్టనున్నట్లు తెలిపారు. పనులు చేపట్టక ముందు, చేపట్టిన తదుపరి డ్రోన్ ద్వారా వీడియోలు తీయాలన్నారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి పనులన్నీ పూర్తి కావాలని ఆదేశించారు.

## ఇ-క్రాప్ సక్రమంగా లేక రైతులకు నష్టాలు

### మండల సమావేశంలో సభ్యుల నిలదీత

**ప్రజాశక్తి పార్వతీపురం రూరల్**

మండలంలో వ్యవసాయ అధికారులు ఇ-క్రాప్ నమోదు వరి పంటకే పరిమితం కావడంతో పత్తి పండించిన గిరిజన రైతులు తీవ్రంగా నష్టపోయారని రావికోన సర్పంచి కె రామస్వామి మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో అధికారులను నిలదీశారు. మంగళవారం మండలం పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిపి మజ్జి శోభారాణి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మండల వ్యవసాయ అధికారి అశోక్ ప్రగతి నివేదిక వివరిస్తుండగా రావికోన సర్పంచి రామస్వామి మాట్లాడుతూ మండలంలో మొత్తం విస్తీర్ణం ఎంత, అందులో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు ఏఏ పంటలను నమోదు చేశారని ప్రశ్నించగా, వరి పంటకే అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు ఎఒ సమాధానం చెప్పారు. రావికోన పంచాయితీలో సుమారు 7 గ్రామాలకు చెందిన గిరిజనులు తమకు ప్రభుత్వం ఇచ్చిన భూముల్లో పత్తి వేశారని, అయితే వాటిని వ్యవసాయ అధికారులు ఇ-క్రాప్‌లో నమోదు చేయలేదని, ఇటీవల కురిసిన వర్షాలకు పత్తి పంట తడిసిపోయి రైతులకు నష్టాలు కలిగాయని తెలిపారు. అలాగే పండిని పత్తిని ఎవరికి అమ్ముకోవాలో తెలియని పరిస్థితి ఏర్పడిందని, దీనిపై జిల్లా అధికారులు స్పందించి వ్యవసాయ అధికారుల నిర్వాకంపై విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం హౌసింగ్, వైద్య, విద్యుత్తు, ఉపాధి, రెవెన్యూ శాఖలకు చెందిన మండల అధికారులు తమ నివేదికలను అందించగా పలువురు సర్పంచులు అధికారులు తీరుపై విమర్శలు గుప్పించారు. స్పందించిన ఎంపిడిఒ కె.రూపేష్ ప్రతినెలా సర్పంచులు తమ పరిధిలో అధికారులను సమన్వయం చేసుకొని గ్రామసభలు నిర్వహించాలని, సభలో సమస్యలను అధికార దృష్టికి తీసుకొచ్చిన అనంతరం, మూడు నెలలకు ఒకసారి జరిగే మండల పరిషత్తు సమావేశంలో ప్రస్తావించాలని అన్నారు. సమస్యను పరిష్కరించని అధికారులపై చర్యలకు తామే సిఫార్సు చేస్తామని సర్ది చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు బంకురు రవికుమార్, సిద్ధ జగన్నాథరావు, ఎఒ రమణమూర్తి, పలువురు ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

ఇ-క్రాప్‌పై ఎఒను నిలదీస్తున్న సర్పంచ్ రామస్వామి

రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌పి మాధవరెడ్డి

## పోలీసు స్టేషన్‌లో ఎస్‌పి ఆకస్మిక తనిఖీ

**ప్రజాశక్తి - సాలూరురూరల్**

స్థానిక రూరల్ పోలీస్ స్టేషనును ఎస్‌పి ఎస్‌వి మాధవరెడ్డి, ఎఎస్‌పి అంకిత సురానాతో కలిసి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి కేసుల వివరాలు, స్థితిగతులను రూరల్ సిఐ రామకృష్ణ, ఎస్సై నరసింహమూర్తిని అడిగి తెలుసుకున్నారు. పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదుదారులు వచ్చినప్పుడు వారిపట్ల మర్యాద, స్నేహ పూర్వకంగా వ్యవహరించాలని తెలిపారు. ఎప్పటికప్పుడు కేసులును పరిష్కరించి న్యాయం చేయాలన్నారు. అప్పుడే పోలీసుల పట్ల ప్రజలకు నమ్మకం పెరుగుతుందని తెలిపారు. అనంతరం పోలీసు స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి పనుల్లో వేగం పెంచాలి

**ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్**

స్థానిక జిల్లా ఆసుపత్రి ఎదురుగా నిర్మిస్తున్న మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను మంగళవారం స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పరిశీలించారు. పనుల పురోగతిపై ఆరా తీశారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని, నాణ్యతలో రాజీలేదని ఎమ్మెల్యే అన్నారు. జిల్లా కేంద్రంలో వైద్యశాల మెరుగుకు పూర్తిస్థాయిలో శ్రద్ధ చూపుతున్నామన్నారు. మల్టీ స్పెషాలిటీ పూర్తయితే ఇక్కడి నుంచి దూర ప్రాంతాలకు కేసుల రిఫర్ తగ్గుతుందన్నారు. కొన్ని విభాగాల్లో నిపుణులైన వైద్యసేవలు అందుబాటులోకి తీసుకువస్తే ఈ ప్రాంత ప్రజలకు ప్రధానంగా గిరిజనులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ఇంజనీరింగ్ అధికారులు పనులపై పూర్తిస్థాయిలో శ్రద్ధచూపి సకాలంలో నిర్మాణాలకు పూర్తయ్యేలా దృష్టి సారించాలన్నారు.

## ట్రైసైకిళ్ల పంపిణీ

**ప్రజాశక్తి - పార్వతీపురం**

జిల్లాలోని ఇద్దరు విభిన్న ప్రతిభావంతులకు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ట్రై సైకిళ్లను మంగళవారం కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో పంపిణీ చేశారు. అలాగే వినికిడి లోపం ఉన్న యువకునికి వినికిడి పరికరాన్ని కలెక్టర్ అందజేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో విభిన్న ప్రతిభవంతులైన తమకు ట్రై సైకిళ్లను మంజూరు చేయాలని మక్కువ మండలం శంబరకు చెందిన టి.నారాయణ రావు, పార్వతీపురం మండలం నర్సిపురానికి చెందిన బండి భాస్కరరావు దరఖాస్తు చేసుకోగా, కలెక్టర్ స్పందిస్తూ ట్రై సైకిళ్లను మంజూరు చేశారు. కాగా పార్వతీపురానికి చెందిన లండ తవిటినాయుడు తనకు వినికిడి లోపం ఉందని, వినికిడి పరికరాన్ని మంజూరు చేయాలని కోరగా కలెక్టర్ మంజూరు చేసి లబ్ధిదారునికి అందజేశారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ ఎడి కె.కవితపాల్గొన్నారు.

వికలాంగునికి ట్రై సైకిల్ అందజేస్తున్న కలెక్టర్

ఎమ్మెల్యేకు వినతిని అందజేస్తున్న మొండెంఖల్ గ్రామస్తులు

## సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్

**ప్రజాశక్తి - కురుపాం**

ప్రజల సమస్యలు పరిష్కరించడానికి ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని మొండెంఖల్‌లో మంగళవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. మొండెంఖల్ పంచాయతీ పరిసర గ్రామాల ప్రజలు ప్రజాదర్బార్‌లో పాల్గొని వారి సమస్యలపై ఎమ్మెల్యేకు వినతులు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేవలం వినతులు తీసుకోవడమే కాకుండా సమస్యకు సంబంధించిన శాఖకు పంపించి సమస్య పరిష్కారమయ్యేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కెవి కొండయ్య, ఎఎంసి మాజీ చైర్మన్ కోలా రంజిత్ కుమార్, టిడిపి నాయకులు వెంపటాపు భారతి , మాజీ జిల్లా కోప్షన్ సభ్యులు రంజిత్ కుమార నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

**ప్రజాశక్తి - కురుపాం**

మండలంలోని గుమ్మ, మొండెంఖల్, పెద్ద గొత్తిలి గ్రామ సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి అన్నారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఆధార్ కార్డులో పేర్లు తప్పుపడినా, చిన్నప్పటి ఫోటోలు, ఫోన్ నెంబర్ లింకు, వేలిముద్రలుపడకపోయినా మార్పులు, చేర్పులు తదితర సేవలను ఆధార్ కేంద్రంలో వెళ్లి, వారి ఆధార్‌ను సరి చేసుకోవాలని అన్నారు. మండలంలోని ప్రజలు ఈ మూడు కేంద్రాల్లో గల ఆధార్ కేంద్రాల్లో సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## కంబరవలసలో వైద్య శిబిరం

**ప్రజాశక్తి - వీరఘట్టం**

మండలంలోని కంబరవలసలో మంగళవారం స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు, జ్వర పీడితులకు, రక్తపోటు మధుమేహ తదితర వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, హెల్త్ సహాయకులు, 104 సిబ్బంది, గ్రామస్తులు, పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న పెద్దింపేట మహిళలు

## పెద్దింపేటలో దాహం కేకలు

**ప్రజాశక్తి - బలిజిపేట**

మండలంలోని పెద్దింపేటలో దాహం కేకలు వినిపిస్తున్నాయి. గ్రామంలో తాగడానికి మంచినీరు లేక మహిళలంతా గ్రామ శివ్లో పామాయిల్ తోటలో బోరునీరు తెచ్చుకోవడానికి ప్రతి రోజు పొలాల గట్ల పైన తుప్పల్లో పడి వెళ్తున్నారు. పంచాయతీ కార్యదర్శి గానీ, గ్రామ సర్పంచ్ గానీ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోకపోవడం చాలా అన్యాయం అన్నారు. ఇప్పుడే పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే రాబోయే వేసవిలో అసలు తాగడానికి నీరండదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కావున ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి మంచినీళ్లు తాగడానికి ఇవ్వాలని కోరారు.

విద్యార్థులతో మార్కింగ్ వేయిస్తున్న పిఇటిలు

## విద్యార్థులతో ఆటస్థలం పనులు

**పార్వతీపురం :** బుధ వారం జరగనున్న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికలు నిర్వహిం చనున్న నేపథ్యంలో క్రీడా మైదానం బాగు చేసే పనులు విద్యార్థు లతో చేయించడం కనిపించింది. మండలంలోని వెంకంపేట మైదానంలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపిక నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిలో భాగంగా జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఆదేశాల మేరకు కొంతమంది వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులతో మార్కింగ్ పనులు చేయించారు. రన్నింగ్, లాంగ్ జంప్, హై జంప్ పోటీలకు అండర్ 17, అండర్ 19 స్థాయి ఎంపికలు నిర్వహించనున్నాయి. జిల్లా స్థాయి ఎంపికల నిర్వహణకు నిధులున్నా విద్యార్థులతో చేయించడం పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## అక్షయపాత్రకు ఇవ్వొద్దు

**ప్రజాశక్తి - పార్వతీపురం**

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో, వసతి గృహాల్లో విద్యార్థులకు ఆహార పంపిణీ కార్యక్రమాన్ని అక్షయపాత్ర ఫౌండేషన్‌కు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించడం సరికాదని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పి.రంజిత్ కుమార్ ఒక ప్రకటనలో చెప్పారు. రాష్ట్రంలో ఒకటో, రెండో చోట్ల నాణ్యత లేని ఆహారం పంపిణీ చేశారన్న సాకుతో అన్ని వసతి గృహాల్లో విద్యార్థులకు ఆహార పంపిణీని అక్షయపాత్రకు ఇవ్వాలని భావించడం సరైన నిర్ణయం కాదన్నారు. దీని వల్ల గిరిజన విద్యార్థులకు మరింత నష్టం జరుగుతుందన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలని, లేకపోతే గిరిజన సంఘాలతో కలిసి ఆందోళన చేపడతామని రంజిత్ కుమార్ హెచ్చరించారు.

## వెంకటరాయుడు పేటలో గ్రామసభ

**ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్**

మండలంలోని వెంకటరాయుడిపేట పంచాయితీలో మంగళవారం రెవెన్యూ గ్రామసభ సర్పంచి చింత సావిత్రి ఆధ్వర్యంలో జరిగింది. ఆర్ఐ రామచంద్రుడు, వీఆర్వో బాబురావుతో పాటు డివిజనల్ రెవెన్యూ అధికారి కార్యాలయం నుండి సిబ్బంది హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తుల నుంచి భూ సమస్యలపై సుమారు 120 దరఖాస్తులు రాగా వాటిని, కేటగిరి వారీలుగా విభజించి త్వరలోనే పరిష్కారం చూపిస్తామని రెవిన్యూ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్ఐ రామచంద్రుడు

# పారిశుధ్య కార్మికుల సంఖ్య పెంచండి

**ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్**

మున్సిపాల్టీలో పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచాలని సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం వద్ద మున్సిపల్ పర్మినెంట్, కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్దకు వచ్చిన స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర కార్మికుల ఉద్దేశించి మీ పనితీరు మార్చుకోవాలని, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టాలని, లేనిచో చర్యలు తీసుకుంటానని హెచ్చరించడం సరికాదన్నారు. కరోనా కష్టకాలంలో ప్రాణాలకు తెగించి పనిచేసింది పారిశుధ్య కార్మికులను, డెంగీ. టైఫాయిడ్, అతిసారం, మలేరియా వంటి ప్రమాదకర వ్యాధులొచ్చేటప్పుడు కష్టబడేది పారిశుధ్య కార్మికులనేనన్నారు. జాతరలు, పండగలు వచ్చేటప్పుడు అదనపు పనిచేసేది పారిశుధ్య కార్మికులని, రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు వచ్చేటప్పుడు అదనపు పనిచేసేది పారిశుధ్య కార్మికులని అన్నారు. తక్కువ జీతాలతో ఎక్కువపని చేసేది పారిశుధ్య కార్మికులేనన్నారు. పట్టణం పెరిగిందని, జిల్లా కేంద్రంగా కూడా రూపుదిద్దుకుందని, అయినా కార్మికుల సంఖ్య మాత్రం పెరగడం లేదని, పనికి తగినన్ని పనిముట్లు ఏర్పాటు చేయడం లేదని, పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కారం కావడం లేదని అన్నారు. అయినా కష్టపడి పని చేస్తూ ప్రభుత్వాలకు, అధికారులకు ప్రతిష్ట తీసుకొస్తున్నది పారిశుధ్య కార్మికుల సమస్యలు తెలుసుకుని పరిష్కారం దిశగా పాలకులు ప్రయత్నం చేయాలని అన్నారు

మున్సిపల్ కార్మికులతో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు వెంకటరమణ

పశువుల పాకలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

# పాకలో పశు వైద్య కేంద్రం

### గ్రామస్తుల సహకారంతో నిర్మాణ పనులు

**ప్రజాశక్తి - వీరఘట్టం**

మండలంలోని నడిమికెళ్ల సచివాలయ పరిధి కడకల్లాలో ఉప పశువైద్య కేంద్రం ప్రస్తుతం పశువుల పాకలో కొనసాగుతుంది. గతంలో భవన సదుపాయం ఉన్నప్పటికీ శిథిలావస్థకు చేరుకొని కూలిపోవడంతో వాటి స్థానంలో కొత్తగా భవన నిర్మాణ పనులు చేపట్టాలని పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేసేదేమీ లేక గ్రామస్తులే కొంత నిధిని పోగుచేసి భవన నిర్మాణ పనులు చేపట్టేందుకు ఇప్పటికే పునాది స్థాయిలో పనులు చేపట్టినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. మరికొంత మొత్తాలను పోగుచేసి తాత్కాలికంగా రేకుల షెడ్డు నిర్మించేందుకు ప్రణాళికలు వేస్తున్నామని విలేకరులకు గ్రామస్తులు తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన బొంగు నారాయణరావుకు చెందిన పశువుల పాకలో విధులు నిర్వహిస్తున్నట్లు లైవ్‌స్టాకు సహాయకులు జి.శ్రీనివాసరావు తెలిపారు. నడిమికెళ్ల సచివాలయం ఉప పశు వైద్య కేంద్రం పరిధిలోనే కడకెళ్ల కూడా ఉందని, వీటి పరిధిలో 530 పశువులు, 4100 గొర్రెలు మేకలు ఉన్నాయని వీటికి వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. సరైన భవన సదుపాయం లేకపోవడంతో ఇటు సిబ్బంది, అటు పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పాడి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి పశు వైద్య కేంద్ర నిర్మాణానికి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## ఘనంగా యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలు

**ప్రజాశక్తి - గరుగుబిల్లి**

మండలంలోని ఉల్లిభద్ర జెడ్‌పి ఉన్నతపాఠశాలలో యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలు మంగళవారం ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎస్.మురళీమోహన్‌రావు, ఆడిట్ కమిటీ కన్వీనర్ పూడి వెంకటనాయుడు మాట్లాడుతూ 12వ పిఆర్‌సి కమిటీని త్వరగా నియమించాలని, పెండింగ్‌లో ఉన్న డిఎలు మంజూరు చేయాలని, జీవో 117ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం యుటిఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నికైంది. గౌరవాధ్యక్షులుగా పి.రవీంద్రనాథ్, అధ్యక్షులుగా పూడి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా తంగుడు శ్రీనివాసరావు, సహాధ్యక్షులుగా మజ్జి మన్మధరావు, అల్లు జయలక్ష్మి, కోశాధికారిగా కలిశెట్టి ధర్మారావు, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా జొన్నాడ సురేష్, సిపిఎస్ కన్వీనర్‌గా బి.ఎరుకు నాయుడు ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా నీరస శ్రీనివాసరావు హాజరయ్యారని తెలిపారు.

## ధోనుబాయి రహదారి మరమ్మతులు చేపట్టండి

**ప్రజాశక్తి - సీతంపేట**

మండలంలోని సీతంపేట నుండి ధోనుబాయి వరకు రహదారి పూర్తిగా మరమ్మతులకు గురైందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం తిరుపతిరావు తెలిపారు. పాడిపోయిన ప్రధాన రహదారి వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వాహన దారులకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. ఇప్పటికే మండలంలోని రోడ్లు పూర్తిగా మరమ్మతులకు గురయ్యాయని, వెంటనే మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు.

# దౌర్జన్యం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

### ఆదివాసీ గిరిజన సంఘం, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

**ప్రజాశక్తి - జియ్యమ్మవలస**

మండలంలోని కన్నపుదొరవలసలో గిరిజనులపై దౌర్జన్యం చేస్తూ వారి భూములు దురాక్రమణ చేయడానికి ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు కూరంగి సీతారాం, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు డిమాండ్ చేశారు. మండలంలోని కన్నపుదొరవలసకు చెందిన నలుగురు గిరిజనులకు సర్వే నంబర్లు 19-2ఎ61,19-2ఎ62,19-ఎ63,19-2ఎ64లో 2-26 సెంట్లు భూమిని దాడిచిలక అర్జునదొర తదితరులకు పోడి పట్టాలు ఇచ్చారన్నారు. అదే గ్రామానికి చెందిన ఈపు గుంపస్వామి ఆ భూమిని స్వాధీనం చేయడానికి ప్రయత్నిస్తూ గిరిజనుల భూమిపై ఉన్న సీతాఫలం మొక్కలు పీకేశారన్నారు. కేవలం రూ.8వేలు అప్పు ఇచ్చి 2ఎకరాల. 26సెంట్లు భూమిని ఆక్రమించడానికి చూస్తున్నారని వారు తెలిపారు. గిరిజనులపై దౌర్జన్యం చేయడానికి ప్రయత్నిస్తున్న గుంపస్వామి కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకోవాలని, గిరిజనులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామంలో ఒకే ఒక్క కుటుంబానికి పెత్తందార్లు నుంచి రక్షణ కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. జిల్లా అంతటా గిరిజనులు, దళితులు భూములు తక్కువ డబ్బులు అప్పుగా ఇచ్చి బయట జిల్లాల నుంచి వచ్చిన పెత్తందారులు, స్థానికంగా ఉన్న పెత్తందారులు పెద్ద ఎత్తున భూ ఆక్రమణలు చేస్తున్నారని అన్నారు. కొమరాడ, పార్వతీ పురం, మక్కువ, సాలూరు, పాచిపెంట మండలాల్లో ఇటువంటి సంఘటనలు అనేకం వున్నాయని వాటి అన్నింటిపై జిల్లా కలెక్టర్ సమగ్ర దర్యాప్తు జరిపించి అన్యాక్రాంతమైన భూములను తిరిగి గిరిజనులు, దళితులు, పేదలకు అప్పచెప్పాలని, లేకపోతే పెద్దఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిని అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బి.మోహన్ రావు పాల్గొన్నారు.

వరద సాయాన్ని ఎమ్మెల్యేకు అందజేస్తున్న సీతానగరం మండల టిడిపి నాయకులు

## వరద బాధితులకు ఆర్థికసాయం

**ప్రజాశక్తి - బలిజిపేట**

విజయవాడ వరద బాధితులకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి సేకరించిన రూ.3.68లక్షలను మండల టిడిపి అధ్యక్షులు పెంకి వేణుగోపాలనాయుడు ఆధ్వర్యంలో పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్రకు చెక్కును మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు పెంకి రామ్మోహన్‌నాయుడు, అలమండ రమణ, డి.భాస్కరరావు, జి.సింహాచలంయుడు, కె.సింహాచలంనాయుడు, క్లస్టర్ ఇన్‌ఛార్జి జి.బాబ్జీ, వివిధ గ్రామాల టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**సీతానగరం:** విజయవాడ వరద బాధితులకు మండలంలోని కోట సీతారాంపురానికి చెందిన పలువురు రూ.15వేలును ఎమ్మెల్యే బి విజయచంద్రకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారాన్ని అందజేయాలని కోరారు. సహాయం అందించిన టిడిపి నాయకులను అభినందించారు.

## ఒకే వ్యక్తికి రెండు చోట్ల పింఛను

**ప్రజాశక్తి - వీరఘట్టం**

మండలంలోని వండవకు చెందిన కొట్టిశ అరం జ్యోతి రెండో చోట్ల పింఛను పొందుతున్నట్టు గ్రామస్తులు మంగళవారం స్థానిక ఎంపిడిఒకు ఫిర్యాదు చేశారు. ఆమె పుట్టింటి గ్రామమైన వండవలోను, అత్తవారి గ్రామమైన పాలకొండ మండలం చిన్న మంగళాపురం సచివాలయం పరిధి గల యాలకురాయిపురంలో అలుగు మంగమ్మ అనే పేరుతో ప్రభుత్వం కళ్లు కప్పి రెండు చోట్ల పింఛన్ పొందుతున్నట్టు ఫిర్యాదు చేశారు. వీటిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలతో పాటు ఇంత కాలం పొందిన పింఛన్ కూడా రికవరీ చేయాలని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. దీనిపై ఎంపిడిఒ బి.వెంకట రమణ మాట్లాడుతూ పరిశీలన జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# పలు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

**ప్రజాశక్తి - సీతానగరం**

మండలంలోని లక్ష్మీపురం, పెదభోగిలి లో పొలం పిలుస్తుందిలో కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు శ్రీనివాసరాజు, అమృతవీణ, ఉమాజ్యోతి, ఎఒ అవినాష్ ఈరోజు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసు రాజు మాట్లాడుతూ ఉద్యాన పంటలు పండించి రైతులకు అధిక ఆదాయం వచ్చే శిక్షణ కార్యక్రమాలు ఇస్తున్నట్టు తెలిపారు. చెరుకు, వరి పొలాలను, సందర్శించిన పిదప కొన్ని పొలాల్లో సుడిదోమ ఉధృతిని గుర్తించామని, అలాగే పొడ తెగులు ను కూడా గుర్తించామని శాస్త్రవేత్త అమృతవీణ తెలిపారు. సుడిదోమ నివారణకు పైమెట్రోజిన్ వాడాలి అని, పొడ తెగులు నివారణకు గాను హెక్సకోనాజోల్/ప్రోపికొన జోల్/వాలిడమైసిన్ వాడాలని సూచించారు. శాస్త్రవేత్త ఉమా జ్యోతి సీజన్లో పండే పండ్లు, కూరగాయలకు విలువల్ని జోడించి అదనపు ఆదాయాన్ని పొందుతారని రైతులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచులు గ్రామ రైతులు, ప్రజాప్రతినిధులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

**సీతంపేట:** మండలంలోని దేవనాపురం, గుమ్మడలో పొలం పిలుస్తుంది కార్యక్రమం ఎఒ పి.శ్రీదేవి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పైరు వేపుగా పెరగడానికి సూచనలు, సలహాలు ఇచ్చారు. కలుపు మొక్కలు తీసివేయాలన్నారు. చీడ పీడలు తొలగించాలన్నారు. రసాయనాలు వాడకూడదని చెప్పారు. యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. సేంద్రియ వ్యవసాయం, అధిక దిగుబడులపై అవగాహన కల్పించారు. ఏ నెలలో ఏ విధంగా పైరు ఉంటుందా క్లుప్తంగా వివరించారు. సమస్యలుంటే రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని కోరారు. అనంతరం రైతులతో సమావేశమయ్యారు ఈ కార్యక్రమంలో జడ్పీఎమ్ బాలు ఉన్నారు .

## గ్రానైట్ యాజమాన్యంపై చర్యలు తీసుకోండి

**ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్**

మండలంలోని బడిదేవరకొండకు ఎటువంటి అనుమతులు లేకుండా గిరిజన సంపదను, దేవుని కొలిచే అడవి కొండలను, నీటి వనరులు పారుదల పర్యావరణ పంటలను జీవనాన్ని నష్టం కలిగించేలా చేపడుతున్న తవ్వకాలు క్వారీ పనులు వెంటనే నిలిపివేయాలని పలువురు గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ కొండ చుట్టూ పంట పొలాలకు, రైతులకు నాశనం జరుగుతుందని, ఆ కొండ ప్రాంతాల్లో గిరిజనులకు వ్యవసాయ భూమి పోడు పట్టాలు ఉన్నాయని , ప్రజా అభిప్రాయాలు లేకుండా అక్రమంగా కొండలను తవ్వకాలు జరుగుతున్నాయని అన్నారు. అనతరం అక్రమ తవ్వకాల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిఆర్‌ఒకు వినతి అందజేశారు. కార్యక్రమంలో గిరిజన జేఏసీ గిరిజన సంఘాల నాయకులు దుక్క సీతారాం, పల్ల సురేష్, మండల గిరిధర్, ఆరిక చంద్రశేఖర్, ఇంటికుప్పల రామకృష్ణ, మోసూరు త్రినాథ్, నాగభూషణ్ పాల్గొన్నారు.

### పవన్‌కల్యాణ్ దృష్టికి బడిదేవర కొండ సమస్య

**పార్వతీపురంరూరల్ :** బడిదేవరకొండ సమస్యను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లినట్లు జనసేన నాయకులు ఎ.మోహన్‌రావు తెలిపారు. మంగళవారం మంగళగిరిలో జరిగిన జనవాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. జనవాణి కార్యక్రమాన్ని నిర్వహించిన ఎమ్మెల్యే బత్తుల రామకృష్ణకు బడిదేవర కొండపై జరుగుతున్న అక్రమ గ్రానైట్ తవ్వకాలపై ఫిర్యాదు అందజేశానన్నారు. .

## విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ

**ప్రజాశక్తి - సాలూరురూరల్**

విద్యార్థుల ఆరోగ్యం పట్ల వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలని మామిడిపల్లి పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ శివకుమార్ తెలిపారు. మండలంలోని అంటివలస గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల వసతులు, భోజన సదుపాయం, మరుగుదొడ్లను పరిశీలించారు. వంటశాలలో పరిశుభ్రతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం, వసతి గురించి అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల వార్డెన్ చిన్న సోములు, ప్రధానోపాధ్యాయులు కెపి మహేంద్రనాథ్, జానకీరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గ్రామసభకు 21 దరఖాస్తులు

**వీరఘట్టం :** మండలంలోని దశమంతపురంలో మంగళవారం డిటి జి.ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన భూ రీసర్వే సమస్యల పరిష్కార గ్రామ సభ కార్యక్రమానికి 21 దరఖాస్తులు వచ్చాయి. ముటేషన్, భూమి ఎచ్చు తగ్గుల సమస్యలు పరిష్కారానికి దరఖాస్తులు వచ్చినట్లు డిటి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వావిలపల్లి ఉషారాణి, మాజీ సర్పంచ్ ఎ.కుమారస్వామి, విఆర్ఒ జి.రాజేంద్రప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

## టెన్త్ విద్యార్థులు నూరుశాతం ఫలితాలు సాధించాలి

**ప్రజాశక్తి - సీతానగరం**

పదో తరగతి విద్యార్థులు శతశాతం ఫలితాలు సాధించాలని పాఠశాల దత్తత అధికారి అయిన ఉపతహసిల్దార్ అల్లువాడ ఉమామహేశ్వరరావు కోరారు. మంగళవారం మండలంలోని ఆర్.వెంకంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పాఠశాలలో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించి వారిలో కూడా మంచి ఫలితాలు వచ్చేలా కృషి చేయాలన్నారు. ప్రణాళికా బద్ధంగా ఇప్పటి నుంచి పిల్లలను పరీక్షలకు సిద్ధం చేయాలన్నారు. ఉపాధ్యాయులతో, విద్యార్థులతో మాట్లాడి అన్ని పాఠశాలల కంటే మెరుగైన ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఆయనతో పాటు ఎంఇఒ-2 ఎం.వెంకటరమణ, హెచ్ఎం వెంకటరమణ, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు

## గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

**ప్రజాశక్తి - వీరఘట్టం**

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపిడిఒ బి.వెంకటరమణ పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని, ఆ దిశగా చొరవ చూపి పారిశుధ్యం పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే తుఫాను ప్రభావం కారణంగా ప్రజలను అప్రమత్తం చేసి వారికి నదీ పరివాహక ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. ప్రతిరోజు తాగునీరు పరీక్షలు చేయాలని, వచ్చిన ఫలితాలను పిఆర్ వన్ యాప్ ద్వారా నమోదు చేయాలని సూచించారు. గ్రామాల్లో ఎవరైనా దీపావళి సామాగ్రి విక్రయాలు జరపాలని అనుకుంటే పాలకొండ సబ్‌కలెక్టర్ ద్వారా అనుమతులు పొందేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మేజర్ పంచాయతీ ఇఒ ఎం.రవి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## చిన్న బొండపల్లిలో నట్టల నివారణ మందులు పంపిణీ

**పార్వతీపురం రూరల్ :** వర్షాకాలం అనంతరం జీవాల్లో ఆశించే నట్టల నివారణకు మందులు వేయించుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మన్మథరావు అన్నారు. మండలంలోని చిన్నబొండపల్లిలో సామూహిక నత్తల నివారణ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. మూగజీవాలకు ఎప్పటికప్పుడు సమీప పశు వైద్యశాలకు తీసుకొచ్చి అవస రమైన టీకాలు వేయించుకొని, ఉచితంగా అందించే మందులను వాడాల న్నారు. ఈ సీజన్లో జీవాలకు నత్తలు ఆశిస్తూ ఉంటాయని, వాటిని సమూలంగా నివారించేందుకు జిల్లాలో నట్టల నివారణ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎడి ప్రసాదరావు, పశువైద్యాధికారి రెడ్డి రమేష్, సర్పంచి గండి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పోలీసు అమరుల దినోత్సవం

**ప్రజాశక్తి - పాలకొండ**

స్థానిక ప్రభుత్వ జూనియర్ బాలురు కళాశాలలో అమరుల సంస్మరణ దినోత్సవ సభ జరిగింది. ఎపిఎస్‌పి ఐదో బెటాలియన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ యు.శ్రీను ఆధ్వర్యాన ఈ కళాశాలలో ఇంటర్ అభ్యసించి పోలీస్ శాఖలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ 2000లో నక్సల్స్ తూటాలకు బలైన కానిస్టేబుల్ ఎన్ని సూరపునాయుడును గుర్తు చేసుకుంటూ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు ఘనంగా నివాళ్లుర్పించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ పైల శంకర్రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వెలమల అప్పారావు, గిరిబాబు , సిమ్మా రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

**సీతానగరం :** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పోలీసుల అమరుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై ఎం.రాజేష్ మాట్లాడుతూ విద్యార్థులకు వివిధ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అలాగే పోలీసులు అత్యవసర పరిస్థితిలో ఉపయోగించే వివిధ రకాల ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది రామకృష్ణ, పద్మ, మణి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇ.ప్రసన్నలక్ష్మి, డి.రామారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న సిఐ అప్పలనాయుడు

## సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలి

**ప్రజాశక్తి - సాలూరు**

విద్యార్థులు, యువత సైబర్ నేరాల పట్ల అవగాహన పెంచుకోవాలని టౌన్ సిఐ బి.అప్పలనాయుడు కోరారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినిలకు మహిళా చట్టాలు, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని చేరుకునే దిశగా సాధన చేయాలన్నారు. స్మార్ట్ ఫోన్లకు అతుక్కుపోయి లక్ష్యాలను నిర్లక్ష్యం చేయరాదని కోరారు. లైంగిక వేధింపులకు పాల్పడినట్లయితే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. మత్తు పదార్థాలు సరఫరా, వినియోగం వంటి కార్యక్రమాలకు దూరంగా వుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పైడిరాజును అభినందించిన విశాఖ ఎంపి

**ప్రజాశక్తి - సాలూరురూరల్**

మలేషియాలో ఈనెల 10న జరిగిన ఇంటర్నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో ఇండియా తరుపున పాల్గొన్న గీతం యూనివర్సిటీ డెంటల్ కళాశాలలో ఎఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్న కనకల పైడిరాజు 800 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం సాధించింది. తమ సంస్థలో పనిచేస్తూ ఇద్దరు పిల్లల తల్లి అయిన తను ఎంచుకున్న ఆటలో ఉన్నత శిఖరాలకు చేరాలన్న కృషిని ప్రతి ఒక్కరూ అభిందించాలని అన్నారు. మరిన్ని పోటీల్లో పాల్గొని ఉన్నత శిఖరాలకు చేరాలని విశాఖ ఎంపి, గీతం యూనివర్శిటీ చైర్మన్ భరత్ ఆకాంక్షించారు.

## విద్య, వైద్యానికి సహకారం

**ప్రజాశక్తి - వీరఘట్టం**

పార్టీ సభ్యత్వ నమోదులో రాష్ట్రస్థాయిలోనే మొదటి స్థానం పాలకొండ నియోజకవర్గం నిలవాలని నియోజకవర్గ టిడిపి బాధ్యులు పడాల భూదేవి పిలుపునిచ్చారు. మండలంలోని తూడిలో పార్టీ సభ్యత్వ నమోదుపై ప్రజలకు అవగాహన కల్పించారు. సీనియర్ నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్ యూనిట్, బూత్ లెవెల్ నాయకులు, చొరవ తీసుకుని గ్రామస్థాయిలో వెళ్లి ప్రతి కుటుంబాన్ని టిడిపి సభ్యత్వం చేయించి వారి కుటుంబ సభ్యులకు విద్య, వైద్యం, ఉపాధికి సహకారం అందేలా చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు సామంతుల దామోదరరావు, కండాపు వెంకటరమణమూర్తి, గుమ్మిడి సింహాద్రి, పి.వెంకటనాయుడు, జంపు చంద్రశేఖరు, డి.లక్ష్మణరావు, ఎస్.సుదర్శన్, కె.గణేష్, అన్నంనాయుడు, సుక్క శ్రీను, పిన్నింటి వెంకటరమణ, పి.రవి, గర్భాన శ్రీను, కార్యకర్తలు, క్లస్టర్, బూతు నాయకులు, పాల్గొన్నారు.